తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
02 జూలై 2024
పేజీలు : 08



# కూలిన మట్టి మిద్దె

## నలుగురు మృతి



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,
జులై 1 (జనంసాక్షి):

రెండు రోజులుగా కురుస్తున్న వానలకు నాగర్ కర్నూల్ మండలం వనపట్ల గ్రామంలో తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో పాత మిద్దె కూలడంతో ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందారు. ఒక గదిలో ఐదుగురు నిద్రిస్తుండగా పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ సంఘటనలో పద్మ (26) పప్పీ(9), వసంత(6), విక్కీ (10నెలలు) పైకప్పు శిథిలాల కింద మృతి చెందారు. గౌడుగు భాస్కర్ (27) గాయాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెయిన్‌లో..



## అంతర్జాతీయ వర్క్‌షాప్, సదస్సులకు గీతం అధ్యాపకులు



**పటాన్చెరు జులై 1 (జనంసాక్షి)**

ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వర్క్ షాప్ సదస్సులలో పాల్గొని, ఉపన్యసించడానికి గీతం, హైదరాబాద్ లోని ఆంగ్లం, ఇతర భాషల విభాగం అధిపతి డాక్టర్ సయంతన్ మండల్, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జోంధాలే రాహుల్ హీరామన్లు విదేశాలకు బయలుదేరి వెళ్లారు. ఫ్రాన్స్లోని నాటింగ్హామ్ ట్రెంట్ యూనివర్శిటీ పోస్ట్కలోనియల్ అండ్ గ్లోబల్ స్టడీస్ రీసర్చ్ గ్రూప్, యూనివర్సిటీలోని పరిశోధనా కేంద్రం ఎమ్మె (ఈఎంఎంఏ) ఆధ్వర్యంలో జూన్ 27-28న నిర్వహించిన బంగ్లా, మరాఠీ దళిత పక్ష పత్రికల 8లో..

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యం

### నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్



నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందించి పేద ప్రజలకు అండగా ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించి సిబ్బంది గురించి ఆరా తీశారు. సరైన సమయానికి సిబ్బంది వైద్యులు హాజరై వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.



## క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మాగనూర్ జూలై 01 (జనం సాక్షి):**

క్రీడల అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం ఉంటుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అకాడమీ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ నందకిషోర్ గోకుల్, సైకిలింగ్ కోచ్ విజయభాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు

## పంచాయతీ భవనానికి మోక్షం..!

### ఈ నెల 3న ప్రారంభించనున్న ఎంపీ..!



**న్యాల్ కల్, జులై 1(జనం సాక్షి)**

న్యాల్ కల్ మండలంలోని ఆత్నూర్ గ్రామంలో దాదాపుగా నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఓ చిన్నపాటి గదిలోనే గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు కార్యక్రమాలు కొనసాగుతూ వచ్చాయి. సభలు, సమావేశాలు, పెరుగుతున్న అవసరాలతో చిన్నపాటి గది గ్రామ పంచాయతీలో పలు కార్యక్రమాల నిర్వహణకు తీవ్ర అసౌకర్యంగా మారడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికార, వివక్ష పార్టీ శ్రేణులు నూతన భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోవడంతో అప్పట్లో అవసరం మేరకు రూ:10 లక్షల మేర నిధులను మంజూరు చేశారు.

### అధికారుల నిర్లక్ష్యం.. ప్రజా ప్రతినిధుల అలసత్వంతో

మండల పంచాయతీ రాజ్ అధికారుల నిర్లక్ష్యం, స్థానిక ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా ఏడాదిలో పూర్తి చేయాల్సిన పనులను ఏకంగా పదమూడున్నరా.. సంవత్సరాల తర్వాత నూతన పంచాయతీ భవనాన్ని పూర్తి చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మొదట్లో ఉపాధి హామీ నిధులు రూ:10 లక్షలు, అనంతరం తిరిగి ఉపాధి హామీ నిధులు రూ:10 లక్షలు, ఇటీవల తాజాగా మండల పరిషత్ నిధులు రూ:5 లక్షల నిధులను వెచ్చించి నిర్మాణాన్ని పూర్తిచేశారు. 8లో..



# పేట జిల్లా నుంచి 30 మంది క్రీడా పాఠశాలకు ఎంపిక

## క్రీడా శాఖ అధికారి శెట్టి వెంకటేష్

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

రాష్ట్రంలోని ఆయా క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంపిక పరీక్షలో నారాయణపేట జిల్లా నుంచి 29 మంది ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శెట్టి వెంకటేష్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారు ఈనెల11,12 రెండ్రోజుల్లో హకీం పేట క్రీడా పాఠశాలలో నిర్వహించే ఎంపిక పోటీల్లో పాల్గొనాలని సూచించారు. 11న ఉదయం అక్కడికి వెళ్లి రిపోట్ చేయాలని పేర్కొన్నారు.వీరిలో 18 మంది బాలురు ,12మంది బాలికలు జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన వారు ఎంపికయ్యారు.బాలికల విభాగంలో ఎన్.మహిత (మద్దూరు),ఎం.సాయి ప్రవళిక (పెద్దాపూర్)కే.హయతి (నారాయణపేట) ఉడత శ్రీవల్లి (దామరగిద్ద), వి.శ్రీలక్ష్మి (ఉజ్జల్లి )జే అనిత (ఉజెల్లి) కే.భ్రమరాంబిక (ఉజ్జల్లి)పి.అభిజ్ఞ (మక్తల్)సత్తి సారిక (దామరగిద్ద) జ్యోతి మీనన్ (నర్వ)సింధు(మక్తల్) ఎంపికయ్యారు.బాలుర విభాగంలో భాగంలో డి లింగప్ప.(మక్తల్) కే.పవన్ కుమార్ (ఉజ్జల్లి),రాజేష్ జక్లేర్ ) బి.అర్జున్ (ఉజ్జల్లి )టి.విశ్వనాథ్ (జక్లేర్)బి. అరవింద్ (మక్తల్),సి.మోహన్ (బాపనపల్లి) జి.వికాస్ (మల్కాజ్ గిరి),డి.అభినవ్ సాయి (మద్దూర్)ఎం అఖిల్ (జక్లేర్), పి.ఆంజనేయులు (ఉజ్జల్లి) ,జి సంతోష్ (బాపనపల్లి)యూ.శ్రావణ్ కుమార్(మక్తల్), ఏ.సాయికిరణ్ (జాజాపూర్), జి.రోహిత్ (గుండు మాల్), జి. మణికంఠ (ఉజ్జల్లి), యశ్వంత్గౌడ్ (మాగనూర్), తిరుమల్లేష్ (మాగనూర్) ఎంపికయ్యారు. వీరు ఎంపికల కోసం విద్యార్థి సంబంధించిన బోనా ఫైడ్, ఆధార్ కార్డ్,బర్త్ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రగతి పత్రం,5 ఫోటోలు తీసుకుని ఉదయం 7 గంటల వరకు హకీం పేట క్రీడా పాఠశాల వద్ద హాజరు కావాలని కోరారు.



# వెల్దుర్తిలో దోపిడీ దొంగల హల్చల్

**వెల్దుర్తి జులై 1 (జనం సాక్షి)**



వెల్దుర్తి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి దోపిడీ దొంగలు హల్ చల్ చేశారు స్థానికంగా గల తిరుమల వైన్స్ మెట్ల ప్రక్కనుండి గోడకు కన్నం వేసి చోరీకి పాల్పడ్డారు. వైన్స్‌లోని 70 వేల నగదు మద్యం కాటాలను అపహరించారు. అంతటితో ఆగకుండా స్థానిక శివ సాయి పారా బైల్ ప్రక్కనగల ట్రాన్స్ ఫార్మను ధ్వంసం చేసి కాపర్ వైర్ ను ఎత్తుకెళ్లారు. అలాగే మొబైల్ దుకాణంలో చోరీకియత్నించారు దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికంగా గల నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు పర్యవేక్షణ కరువైందని పూర్తిగా పనిచేయడం లేదని ప్రజలు పోలీసుల తీరుపై మండిపడుతున్నారు. స్థానిక వైన్స్ క్లూస్ టీం చేరుకొని వేలిముద్రలు నమూనాలను సేకరించారు రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ కరువైందని అందుకే దొంగలు చెలరేగిపోతున్నారని ప్రజల అభిప్రాయపడుతున్నారు. కస్తిని పెంచి నిఘా నేత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజల అభిప్రాయపడుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై నవత గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తాం

- మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి
- కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**మఖ్తల్ జులై 01 (జనంసాక్షి)**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి భరోసా ఇచ్చారు. సోమవారం కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. మఖ్తల్ మండలంలో 69 చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తామని, రైతు రుణమాఫీ త్వరలో ప్రారంభం కానుందని, కళ్యాణ లక్ష్మీ పథకంపై ఇచ్చిన హామీకి గైడ్ లైన్స్ రూపొందుతున్నాయని తెలిపారు. కళ్యాణ లక్ష్మీ పథకంపై ప్రత్యేక విభాగం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అంతకు ముందు కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ ను తనిఖీ చేశారు. డ్రైనేజీ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపాలిటీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ సువర్ణరాజ్, నేతలు లక్ష్మారెడ్డి, చంద్రకాంత్ గౌడ్, కోళ్ళ వెంకటేష్, గణేశ కుమార్, ఎ.రవి కుమార్, గడ్డంపల్లి హనుమంతు,



గోలపల్లి శంకరమ్మ, చందాపూర్ నర్సిములు, శంషుద్దీన్,కావలి తాయప్ప, కావలి రాజేందర్, నాగరాజ్ , వాకిటి హన్మంతు, రహీం పటేల్, శాలం బిన్ ఉమర్, సత్యారం రవి, వాకిటి శ్యామ్, కల్లూరి గోవర్ధన్, గుంతలి రవి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త చట్టాలపై విద్యార్థులకు ప్రజలకు అవగాహన

## శ్రీరంగాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకటేశ్వర్లు

**శ్రీరంగాపూర్ జూలై 1 (జనం సాక్షి)**

శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో కొత్త క్రిమినల్ చట్టాల గురించి హై స్కూల్ విద్యార్థులకు మరియు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించిన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకటేశ్వర్లు. జిల్లా పరిషత్ హై స్కూల్ బాలురు బాలికలకు మరియు స్టేషన్లో వివిధ పార్టీ రాజకీయ నాయకులకు నూతన క్రిమినల్ చట్టాల మార్పుపై ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1, మైనర్ అత్యాచారం కేసులో నిందితుడికి మరణశిక్ష 2, గ్యాంగ్ రేప్ కేసులో నిందితులకు 20 ఏళ్ల జైలు



శిక్ష, 3,ఎఫ్ఐఆర్ నమోదైన 90 రోజుల్లో కేసుకు సంబంధించిన అప్డేట్ కచ్చితంగా నమోదు చేయాలి. 4 కేసు విషయంలో మైనర్లు మహిళలు సీనియర్ సిటిజన్స్ కు పోలీస్ స్టేషన్కు వెళ్ళవలసిన అవసరం లేదు. 5,ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేస్తే ఏడాది జైలు శిక్ష, 6,ఆర్గనైజర్ క్రైమ్ విషయంలో కొత్త చట్టాల రూపకల్పన, 7 తీవ్రవాదాన్ని పూర్తిస్థాయిలో పేర్కొన్న కొత్త చట్టం, 8 రాజ ద్రోహంపై పూర్తిగా రద్దు అయిన చట్టం, 9,సంఘ సేవ పేరుతో చేసే త్రివరమైన చర్యలకు కూడా శిక్ష వేసే అవకాశం, 10,కోర్టులో మొదటి వాదన జరిగిన 60 రోజుల్లో అభియోగం నమోదు చేయాల్సి ఉంటుంది, 11, కేసులో వాదన పూర్తి అయిన 45 రోజుల్లో తీర్పు ఇవ్వాల్సిందని అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు విద్యార్థులకు రాజకీయ ప్రముఖులకు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ ప్రముఖులు విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో వసతులు కల్పించండి

## కలెక్టర్‌కు విన్నవించిన బీజేపీ నేతలు

**వనపర్తి, జూలై01 (జనంసాక్షి):**

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అవసరమైన వసతులు కల్పించాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము అధ్వర్యంలో ఆ పార్టీ నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో గల 100 పడకల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో పేషంట్లకు వారి అటెండెంట్లకు, ఔట్ పేషంట్లకు కనీస సౌకర్యాలు లేక పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. బచ్చు రాముతో పాటు బీజేపీ రాష్ట్ర ఓబిసి సెల్ అధికార ప్రతినిధి శ్రీశైలం మాట్లాడుతూ హాస్పిటల్‌కు అత్యంత అధునాతన మైన పెద్ద భవనము ఉన్నా కూడా అందులో కనీస సౌకర్యాలు లేవని, ముఖ్యంగా ప్రతి విభాగంలో వుండాల్సిన డాక్టర్లు లేరని, 100 పడకల హాస్పిటల్‌కు కేవలం, ఒకరు, ఇద్దరు డాక్టర్లచే నెట్టుకొస్తున్నారని, ఉన్న వారిలో కూడా ఒకరు లాంగ్ లీవ్‌పై వెళ్ళారని అన్నారు. దీనితో పేషెంట్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పేరుకే 100 పడకల హాస్పిటల్ కానీ చిన్న చిన్న చికిత్సలు కూడా చేయకుండా వచ్చిన బాధితులను మహబూబ్ నగర్ హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారని అన్నారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా రెఫరల్ హాస్పిటల్ అయినప్పటికీ గైనకాలజీ, రేడియాలజీ, సియంఒ. కన్సల్టన్సీ, జనరల్ మెడిసిన్ విభాగాలలో డాక్టర్లు లేనందున బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పేషెంట్సు, పేషెంట్స్ బంధువులకు కూర్చోవడానికి కనీసం కుర్చీలు, బెంచీలు, మంచినీరు తదితర వసతులు వసతులు లేవని,ప్రభుత్వ



జనరల్ హాస్పిటల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏ. సీతారాములు, బండారు కుమారస్వామి, మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మ, మోర్చా జిల్లా నాయకులు ఓం ప్రకాష్ చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి మామిళ్ళపల్లి రాయన్న సాగర్, బక్క శీను, నరసింహ, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్న బిజెపి

**ఆత్మకూర్ వనపర్తి జూలై 1 (జనం సాక్షి)**

అమరచింత మండల కేంద్రంలోని జీఎస్ భవనంలో సోమవారం సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ.. మాట్లాడుతూ..మెడికల్ ఎంట్రెన్స్ నీట్ పరిక్ష పేపర్ లీక్ అవ్వడంతో పేదలు డాక్టర్ కావాలన్న కల నెరవేర్చకుండా బిజెపి చేస్తున్నదని దుయ్యబట్టారు. ఆదివారం నాడు ప్రధాని మోదీ మన్‌కి బాత్ కార్యక్రమంలో నీట్ పరీక్షపై మాట్లాడకపోవడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రానికి బంగారు గనిగ ఉన్న సింగరేణి బొగ్గు గనిని వేలం పాటలో పెట్టడం ద్వారా సంస్థను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకున్నదని. విమర్శించారు. వెంటనే వేలంపాటను రద్దుచేసి ప్రైవేట్ కరించే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆగ మేఘాల మీద నిర్మించిన రామాలయం సైతం చిన్నపాటి వర్షాలకి వర్షపు నీళ్ళు దేవాలయంలోకి ప్రవేశించాయి అంటే ఎంత నాసిరకంగా దీనిని నిర్మించారో అర్థమవుతుందని విమర్శించారు. అలాగే ఢిల్లీలోని ఎయిర్పోర్ట్ సైతం వర్షానికి కూలిపోయిందని దుయ్య బట్టారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలు ఇచ్చిన 6 గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేదలు వేసుకున్న గుడిసెలు అన్నింటికి పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే పెంచిన పెన్షన్లను. 2016నుంచి 4016, 4016 నుంచి 6016కు పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వెంకటేష్, రమేష్, అజయ్, రాజు మండల నాయకులు శ్యాంసుందర్, బుచ్చన్న, అనంతమ్మ. బేకేం విష్ణు, వెంకటేష్, రవి, రాఘవ, చంటి తదితరులు పాల్గొన్నారు.



# రైతులలకు మెరుగైన సేవలు అందించాలి

## మండల గౌడ సంఘం అధ్యక్షుడు నాయిని గజినీ వెంకట్ గౌడ్

**కొల్చారం జూలై 01 (జనం సాక్షి)**

లారీ అసోసియేషన్ రైతులకు, రైస్ మిల్లర్లకు అనుసంధానకర్తలుగా వ్యవహరించి సకాలంలో సేవలు అందించాలని..ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా సమిష్టి నిర్ణయాలతో మరింత ఎత్తుకు ఎదగాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు నాయిని గజినీ వెంకట్ గౌడ్ అన్నారు. మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజినీ వెంకట్ గౌడ్ ప్రోత్సాహంతో ఏర్పాటైన మండల లారీ అసోసియేషన్ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు గాని, రైస్ మిల్లర్ల నుంచి ఎఫ్సీఐకి బియ్యం తీసుకుపోవడంలో గాని గొడవలకు తావివ్వకుండా సీరియల్ ప్రకారం వెళ్లాలన్నారు. ఇప్పటివరకు కొల్చారం మండలంలో లిక్కర్ గోదాం మాత్రమే ఉండేదని, ఇప్పుడు మండలంలో రెండు పారా బాయిల్డ్ రైస్ మిల్లులతో లారీలకు పని దొరుకుతుంది అన్నారు. గొడవలకు తావివ్వకుండా లారీలను సక్రమంగా, సకాలంలో తీసుకువెళ్లి సేవలందించడం తోపాటు నిరుద్యోగ యువకులు ఉపాధి పొందలని అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఏర్పాటుకు ప్రోత్సహించిన గజిని వెంకట్ గౌడ్, ముఖ్య అతిథి మల్లేశం గౌడ్‌ను లారీ అసోసియేషన్ నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి పారాబాయిల్డ్ రైస్ మిల్ యజమాని శ్రీనివాస్ గుప్తా, స్థానిక నాయకులు ధనరాజ్, తిమ్మకపల్లి గోపాల్, లారీ అసోసియేషన్ నాయకులు మల్లేశం, రమేష్, సదాల శ్రీను, నర్సింలు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన తల్లి కూతుర్లు

**వెల్దుర్తి జూలై 1 జనం సాక్షి**





వెల్దుర్తి మండలంలోని శంశి రెడ్డి పల్లి తండాలో తల్లి కూతుర్లు అదృశ్యమైన సంఘటన గత నెల 26వ తేదీన చోటుచేసుకుంది. భర్త రవీందర్ కుమార్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం శంశి రెడ్డి పల్లి గ్రామానికి చెందిన భార్య సునీత కూతురు వైష్ణవిలతో తాను మేడ్చెల్ లోను నివాసం ఉంటున్నట్లు తెలిపారు. తాను పని నిమిత్తం గురువారం రోజున తాను పని నిమిత్తం బయటకు వెళ్ళగా గురువారం సాయంత్రం నుండి తన భార్య కూతురు కనిపించడం లేదని తెలిపారు. తన బంధువుల వద్ద ఇతర గ్రామాలలో ఆరా తీయగా ఎక్కడ కనిపించడం లేదని తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# వేతనాలు ఇవ్వాలంటూ హల్తి గర్ల్స్ కోర్ట్ కార్మికుల సమ్మె

**వెల్దుర్తి జూలై 1 (జనం సాక్షి)**

మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామ శివారులోని హల్ది గల్ఫ్ కోర్టు ముందు సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. తాము గత ఐదు సంవత్సరాలుగా ఈ గల్ఫ్ కోర్టు సంస్థలో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. మూడు నెలలుగా గల్ఫ్ కోర్టు యాజమాన్యం తమకు వేతనాలు ఇవ్వడం ఇవ్వడం లేదంటూ గల్ఫ్ కోర్టు ప్రధాన గేటు ముందు ఆందోళనకు దిగారు తాము 95 మందిని పనిచేస్తున్నామన్నారు. మూడు నెలలుగా తమకు వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు యాజమాన్యంలో ఏర్పడిన విభేదల వల్లే తమకు వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆరోపించారు. ఇప్పటికైనా గల్ఫ్ కోర్ట్ ప్రతినిధులు తమకు వేతనాలు అందించి ఆదుకోవాలని వేడుకున్నారు తాము పరిశ్రమలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మహారాణాతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

# కొండాపూర్ 144 సర్వే నెంబర్‌పై గ్రామస్తుల ఫిర్యాదు

**తూప్రాన్ జూలై 1(జనం సాక్షి):**



మనోహరాబాద్ మండల్ కొండాపూర్ గ్రామంలో 144 సర్వే నంబర్ భూమి రిజిస్ట్రేషన్లు నిలిపివేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మనోహరాబాద్ తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి కొండాపూర్ గ్రామస్తులు సమర్పించారు. మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ శివారులో 144 సర్వేనెంబర్ 11 ఎకరాల 37 గుంటల భూమి కొన్ని సంవత్సరాల నుండి గ్రామస్తులకు భూ యజమానులకు గొడవలు జరుగుతున్నాయి ప్రతి ఎన్నికలలో ఇది ప్రభుత్వ భూమి అంటూ రాజకీయ నాయకులు గ్రామస్తులను నమ్మించి అధికారంలోకి రాగానే మీకు ఇళ్ల స్థలాల పంపిణీ చేస్తామని హామీలు ఇవ్వడంతో గ్రామస్తులు ఆ భూమిపై ఆశలు పెంచుకున్నారు. ప్రభుత్వ రికార్డులలో పట్టా భూమి ఉండడంతో రెవెన్యూ అధికారులు ఇతరులకు ఇటీవల పట్టాలు చేస్తున్నారు కార్యకర్త అని ఉండడంతో ఇది ప్రభుత్వ భూమి అని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గ్రామపతుల పంచాలని వారు డిమాండ్ చేస్తూ ఉన్నారు. కొండాపూర్ గ్రామానికి ఆనుకొని ఉన్న 144 సర్వే నెంబర్ 11 ఎకరాల 37 గుంటల భూమిని గ్రామానికి చెందేలా చూడాలని తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. భూ రిజిస్ట్రేషన్లు నిలిపివేసి గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు. దీంతో తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు తెలిపిన పహానిలో మరి శేఖర్లు కార్యకర్త అని రాసి ఉన్న ఒరిజినల్ రికార్డులు తమ వద్ద లేవని ఉన్న రికార్డులలో పట్టా అని మాత్రమే రాసి ఉందని ఆయన తెలుపుతూ గ్రామస్తులు ఇచ్చిన పత్రాలను జిల్లా కలెక్టర్కు తెలుపుతానని ఆయన ఆదేశాల మేరకు పని చేస్తానని ఆయన గ్రామస్థులక తెలిపారు కలెక్టర్ ఆదేశాలు వచ్చేంతవరకు 144 సర్వే నెంబర్ రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలని ఆయనను కోరారు. తాసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన అనంతరం గ్రామస్తులు కొండాపూర్‌లో 144 సర్వే నెంబర్ చుట్టూ వేసిన సిమెంట్ పలకలను ఆగ్రహంతో తొలగించారు విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి గ్రామస్తులను శాంతింప చేసి ఇది వర్గాలు చర్చించుకోవాలని సూచించారు.



# సమాజలో డాక్టర్స్ సేవలు చిరస్మరణీయం

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 1 (జనం సాక్షి)**

సమాజంలో డాక్టర్ వృత్తి ఎంతో పవిత్రమైనదని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ అన్నారు. డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి లోని ప్రైవేట్ ఆస్పత్రి సన్ రైస్ హాస్పిటల్, డాక్టర్ స్వామి గౌడ్ డాక్టర్ మల్లికా, సువర్ణ, గురు, సహస్ర హాస్పిటల్ డాక్టర్ రాజు గౌడ్, డాక్టర్ మణిదీప్ గార్లకు శాలువా పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది, ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ మాట్లాడుతూ, కరోనా వంటి మామ్మోరిని సైతం లెక్కచేయకుండా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసిన గొప్ప మానవతావాదులు డాక్టర్స్ అని కొనియాడారు. ఈ ప్రపంచంలో కంటికి కనపడని దేవుండ్లు డాక్టర్స్ అని వారిసేవలను గుర్తు చేశారు. మనుషులందరూ మూఢనమ్మకాలు విడి సైన్స్ మార్గంలో నడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు కృష్ణా గౌడ్, నరసింహ గౌడ్, కృష్ణా గౌడ్, వెంకటేష్ గౌడ్, రాములు గౌడ్ పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ




**కృష్ణ. జులై 1 (జనం సాక్షి)**

మండలం కెంద్ర రైతు సభా వేదిక హాల్లో సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 26 మందికి కల్యాణ్ ,లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి. అనంతరం మాట్లాడుతూ ఈ చెక్కులను సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు. ప్రతి గ్రామంలో కూడా నీళ్లు కానీ ఇతర రోడ్ సమస్యలు కానీ ఆ సమస్యలను పరిష్కరిస్తానని, మికు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ దయాకర్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మండల అధ్యక్షులు రాజప్ప గౌడ్,మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లే సురేష్, సంతోష్ గౌడ్,సోమ సంతోష్, బి.మహాదేవ, బిఆర్ఎస్ పార్టీ మండల యువ అధ్యక్షుడు శివరాజ్ పటేల్, కుసుమూర్తి మౌనేష్,ఇతర పార్టీల కార్యకర్తలు బిజెపి నాయకులు, సోమ శేఖర గౌడ్, నల్లే నరసప్ప, ముడుమాల్ దండు రాఘవేంద్ర, మహీళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుని జన్మదిన వేడుకలు

**దౌల్తాబాద్ జులై 1(జనం సాక్షి)**

దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు పబ్బ అశోక్ గుప్త జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్దిపేట అయ్యప్ప స్వామి టెంపుల్ అధ్యక్షుడు అయిత రత్నాకర్, పబ్బ అశోక్ గుప్త ను శాలువాతో సన్మానించి, మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుకునూరు పల్లి అధ్యక్షుడు శ్రీనివాస్, సిద్ధి బిక్షపతి, గజ్వేల్ వాసవి క్లబ్ అధ్యక్షులు శేఖర్ గుప్తా, గంప రవి గుప్త, తదితరులు పాల్గొన్నారు.



## రావుల చేయూత

**శ్రీరంగాపూర్ జూలై 1 (జనం సాక్షి)**

శ్రీరంగాపూర్ మండల్ జానంపేట గ్రామంలో పాటిమీని ఆంజనేయులు మరణించగా ఇట్టి విషయాన్ని మాజీ ఎమ్మెల్యే మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి దృష్టికి జానంపేట గ్రామ టిఆర్ఎస్ నాయకులు తీసుకెళ్లగా వారి కుటుంబానికి రావుల చంద్రశేఖర్ రెడ్డి సానుభూతి తెలియజేస్తూ చనిపోయిన పాటిమీని ఆంజనేయులు కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం చేయడమైనది. ఇట్టి కార్యక్రమంలో జానంపేట గ్రామం నాయకులు మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ నరసింహ పరశురాముడు, నాగరాజు, ఆచారి శ్యాంసుందర్ రెడ్డి ఖయ్యూం మాజీ ఉప సర్పంచ్ శివుడు యాదవ్, కావాలి మాసన్న, పాటిమీని రాజు కొత్త గొల్ల వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్ యాదవ్, బోనాసి చెల్లయ్య పాల్గొన్నారు.



## డాక్టర్లు ప్రాణ రక్షకులు

**వనపర్తి, జూలై 01 (జనంసాక్షి):**

డాక్టర్లు ప్రాణ రక్షకులని,అందుకే వైద్యో నారాయణో హరి అని పెద్దలు ప్రవచించారని వనపర్తి మున్సిపల్ కోఆప్టెడ్ మెంబర్ గులా ఖాదర్ కొనియాడారు. జాతీయ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రముఖ డాక్టర్లు బి. రమేష్ బాబు, బి. ప్రతిభా, బి. నగేష్, బి. హేమశ్రీలను సన్మానించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గులాం ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ వైద్య వృత్తిని మించినది మరోది లేదన్నారు. కుల, మతాలకు అతీతంగా వైద్య చికిత్సలు అందిస్తూ రోగుల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా పని చేయడం అపూర్వమన్నారు. ఈ కార్యక్రమంలో గులాం ఖాదర్ ఖాన్ తో పాటు బీఆర్ఎస్ నాయకులు మాధవరావు నీలస్వామి పాల్గొన్నారు.

## ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

### మహిళా సాధికారత సమన్వయకర్త పల్లవి

సంగారెడ్డిప్రతినిధి, జులై 1(జనంసాక్షి)

నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి అన్నారు. సోమవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ,మహిళ సాధికారత కేంద్రం (డిహెచ్ఈ డబ్ల్యు)అధ్వర్యంలో, భేటీ బచావో - భేటీ పడావో లో భాగంగా సంగారెడ్డి మండలంలోని పసల్ వాది జిల్లా పరిషత్ పాఠశాలలో అవగా



హన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా మహిళ సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఆడపిల్లల విద్య ప్రాముఖ్యతను, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, హెల్ప్ లైన్ నంబర్స్‌ను భారతీయ న్యాయ సంహిత చట్టం గురించి తెలియజేశారు. అదే విధంగా సఖి సేవలు, సైబర్ క్రైం ,ఆన్లైన్ సేఫ్టీ వంటి అంశాలు ఈ కార్యక్రమంలో తెలియజేశారు. ఈ కార్యక్రమం షీ టీమ్ సభ్యులు మరియు సఖి టీమ్ ,స్కూల్ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద విధానాలను తిరస్కరించిన ప్రజలు

- **ప్రజలపై భారాలు వేయడానికి సిద్ధమైన బిజెపి ప్రభుత్వం**
- **సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జీ నాగయ్య**

**కొమురవెల్లి జూలై 01 (జనం సాక్షి)**

పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి మతోన్మాద విధానాలను ప్రజల తిరస్కరించారని అయినప్పటికీ బొగ్గు గనులను వేలం వేసే పేరుతో ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రజలపై భారాలు వేయడానికి సిద్ధమయ్యారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య అన్నారు. కొమరవెల్లి మండల కేంద్రంలో సిపిఎం సిద్దిపేట జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన జి. నాగయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 400 సీట్లు సాధించి ప్రతిపక్షం లేకుండా తన ఇష్టారాజ్యంగా మతోన్మాద విధానాలను యదేచ్ఛగా అమలు చేయడానికి సిద్ధమైన నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బిజెపిని తిరస్కరించారని తగిన బుద్ధి చెప్పారని అన్నారు. అయినప్పటికీ ప్రజలపై మళ్ళీ దాడులు చేయడానికి అనేక చట్టాలు చేస్తుందని మండిపడ్డారు. సాగు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై రైతాంగం సాగించిన పోరాటం ఫలితంగా ఉత్తరాది రాష్ట్రాల్లో రైతాంగ పోరాటం జరిగిన అనేక నియోజకవర్గాల్లో బిజెపి చిత్తుచిత్తుగా ఓడిపోయింది అన్నారు. దేశంలో ఇండియా కూటమి బలంగా ఉందని కేంద్రం మెడలు వంచి మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ప్రజల్లో నిరుత్సాహం వ్యక్తం అవుతుందని అన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బిఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారని దానికి కారణాలను వెతుక్కోకుండా ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతానని అనడం సరైనది కాదని అన్నారు. రాష్ట్రంలో బిజెపి మతోన్మాద ప్రమాదం పెరుగుతుందని దీనిని అరికట్టాలంటే రాజకీయాలకతీతంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం లౌకిక




తత్వాన్ని కాపాడాలని ప్రజలపై దాడులను ఆపాలని ఐక్యంగా కేంద్ర బిజెపిపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, కాముని గోపాలస్వామి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, సందబోయిన ఎల్లయ్య, గోడ్డుబర్ల భాస్కర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామసాగర్ మాజీ సర్పంచ్ తాడూరు రవీందర్ కొంగరి వెంకట మావో ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, అమ్ముల బాల నరసయ్య, బద్దిపడిగా కృష్ణారెడ్డి, అత్తిని శారద, బండ కింద అరుణ్ కుమార్, సింగిరెడ్డి నవీన, జాలిగాపు శిరీష, దాసరి ప్రశాంత్, మండల నాయకులు తేలు ఇస్తారి తాడూరు మల్లేష్ బక్కెల్లి బాలకిషన్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి మరణం విద్యార్థి, ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు

**మఖ్తల్ జూలై 01 (జనంసాక్షి)**

ఊట్కూర్ మండల పరిధిలోని నిడుగుర్తి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి అకాల మరణం విద్యార్థులకు ఉపాధ్యాయులకు తీరని లోటని తెలంగాణ విద్యావంతుల వేదిక ఉమ్మడి పాలమూరు జిల్లా సమన్వయకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మారెడ్డి విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని జిజ్ఞాసతో విద్యా వాలంటీర్ గా ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించి తదనంతరం ఉపాధ్యాయుడుగా



ఎన్నికై నిరంతరం నూతన ఒరవడితో కూడిన విద్యను అందించాలనే అకాంక్షతో పాఠశాలకు సకాలంలో హాజరై ఉపాధ్యాయు లకు, విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండేవారని కొనియాడారు. లక్ష్మారెడ్డి విద్యార్థి లోకానికే కాకుండా ఉపాధ్యాయుల సమస్యలపై కూడా ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా నేనున్నానంటూ నిరంతరం గలమెత్తి సమస్యలను సంధించేవారని పేర్కొన్నారు. ఏది ఏమైనాప్పటికీ అనతి కాలంలోనే అందరి మన్ననలు పొంది అకాల మరణం పొందడం సమాజానికి తీరనిలోటని తెలిపారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు.

# వైద్యుల సేవలు వెలకట్టలేనివి



### జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సన్మానం

**మక్తల్ జూలై 01 (జనంసాక్షి)**

వైద్యుల సేవలు వెలకట్టలేనివి అని తెలంగాణ స్టేట్ ప్రైవేట్ నర్సింగ్ హోం స్టాఫ్ నర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బాబూ మియా అన్నారు. మఖ్తల్ పట్టణంలోని అతిథి గృహంలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్ వో డాక్టర్ సౌభాగ్య లక్ష్మి తోపాటు ఇతర వైద్యులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రజల శారీరక సమస్యలను నయం చేసే వైద్యులు దైవంతో సమానమని అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ఇస్తారని అన్నారు. ప్రముఖ వైద్యులు, పశ్చిమ బెంగాల్ తొలి ముఖ్యమంత్రి డాక్టర్ బిపిన్ చంద్ర రాయ్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా జాతీయ వైద్యుల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత రత్న పురస్కారం అందుకున్నారని, ఆయన జయంతి, వర్ధంతి జులై 01 నే అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పార్వతి, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రాణేశ్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ రాము, డాక్టర్ రాజేశ్ గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

**సంగారెడ్డి ప్రతినిధి,జులై 1(జనం సాక్షి)**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పట్నమాణిక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సంబంధించిన కుటుంబ సభ్యులకు, పేదవారికి అన్నదానం చేస్తున్నారు. ఫసల్ వాది మాజీ సర్పంచ్ పట్నం నిర్మలాదేవి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.





## నీట్ పరీక్షను, ఎన్టీఏను వెంటనే రద్దు చేయాలి

### ఎన్ఎస్‌యుఐ వెంకట్

**గద్వాల నడిగడ్డ, జూలై 1 (జనం సాక్షి)**

ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఆదేశానుసారం జోగులాంబ గద్వాల జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో నీట్ పరీక్షను, ఎన్డిఏను రద్దు చేయాలని నిరసిస్తూ సోమవారము ఐజ పట్టణం కొత్త బస్టాండ్ చౌరస్తాలో విద్యార్థులతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. నీట్ పరీక్ష సమస్యపై దేశ ప్రధాని నరేంద్రమోడీ నిర్లక్ష్యపు వైఖరిని, నీట్ విద్యార్థుల సమస్యలపై బీజేపీ నేతలకు విద్యార్థుల భవిష్యత్తు పై చిత్తశుద్ధి లేని కేంద్ర ప్రభుత్వం నశించాలని వారు అన్నారు. గత పది సంవత్సరాలుగా బీజేపీ హయాంలోనే టెస్టింగ్ ఏజెన్సీ లు పరీక్ష నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చెందారని, వాటి మూలంగానే విద్యార్థుల బంగారు భవిష్యత్తు ప్రశ్నఅర్థకంలో పడ్డాయన్నారు. నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పుతూ మళ్లీ పరీక్షను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు ప్రకాష్ యోనా,చారి, నవాజ్, సూర్య చంద్ర, నరేష్ విజయ్, రహీమ్ ,రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



**కొండపాక, జూలై,1(జనం సాక్షి):**
అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు అన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో గ్రామాలు క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండాలని అన్నారు.గ్రామాలలో సర్పంచ్ పదవులు ముగిసి ఆరు నెలలు కావస్తున్న గ్రామాల అభివృద్ధిలో అధికారులే పాటుపడాల్సి వస్తుందని అన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో ఎన్నికలు వచ్చేవరకు ఏ సమస్య గ్రామాలలో ఉండకుండా చూడాలన్నారు.పై అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణ హరితహారం, మిషన్ భగీరథ పైప్ లైన్స్ సవ్యంగా చూసుకోవాలని అన్నారు. నీటి కొరత లేకుండా ప్రజలకు నీటిని అందించాలని కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అరికట్టడానికి, దోమలు రాకుండా ఫాగ్ మిషిన్ వాడాలన్నారు. గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను పూర్తి చేయలని పిఆర్ ఏఈ తిరుపతి రెడ్డిని కోరారు.కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షులు చింతల సాయిబాబా గౌడ్, ఎంపీటీసీలు బాలాజీ పత్తి ఆంజనేయులు, అధికారులు, ఆయా గ్రామాల సెక్రెటరీలు పాల్గొన్నారు.

# ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

## 12 బైకులు స్వాధీనం

**తూప్రాన్ జూలై 1 జనం సాక్షి):**
ఇద్దరు బైక్ దొంగలను పోతురాజు పల్లి కమాన్ వద్ద అరెస్టు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి విలేకరుల సమావేశంలో తెలిపారు. గజ్వేల్ నుంచి తూప్రాన్ వస్తుండగా పోతురాజు పల్లి కమాన్ వద్ద ఇద్దరు మోటార్ సైకిల్‌పై రావడం గమనించి పోలీసులు అనుమానాస్ప దంగా పట్టుకొని విచారించగా 12 బైకులను దొంగతనం చేసినట్లు వారు ఒప్పుకున్నారని ఎస్పీ వివరించారు. సిద్దిపేట జిల్లా మక్త మైలారం కు చెందిన బూరుగుపల్లి స్వామి బూరుపల్లి మల్లేష్



ఇద్దరు వద్దనుండి 12 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తూప్రాన్ పోలీస్ స్టేషన్లో మూడు బైకులు మనోహరాబాద్ పోలీస్ స్టేషన్లో రెండు బైకులు కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్లో రెండు బైకులు ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైకు గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైకు లను స్వాధీనం చేసుకున్నట్లు చేసినట్లు వారు ఒప్పుకున్నారని ఎస్పీ బాలస్వామి వివరించారు. ఇవి కాక వారి వద్ద నుండి మరో మూడు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు యజమానుల వివరాలు తెలియకపోవడంతో వాటిని పోలీస్ స్టేషన్ ఆధీనంలో ఉంటాయని తెలిపారు. బూరుపల్లి స్వామి గతంలో గజ్వేల్ పోలీస్ స్టేషన్లో బైక్ దొంగతనం కేసులు జైలుకు వెళ్లి వచ్చారని ఆయన వివరించారు బైక్ దొంగలను పట్టుకోవడంలో ఎస్ఐ శివానంద్ ఎస్సై యాదగిరి కానిస్టేబుల్ సురేష్ కృష్ణ నాగేంద్రబాబు లను ఎస్పీ అభినందించారు.




# డాక్టర్లకు ఘన సన్మానం

**సంగారెడ్డి ప్రతినిధి,జూలై 1 (జనం సాక్షి)**
డాక్టర్ దినోత్సవం సందర్భంగా మంజీరా రైతు సమాఖ్య ఆధ్వర్యంలో డాక్టర్లకు ఘనంగా సన్మానించారు. సోమవారం సదాశివపేట పట్టణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ గంజి ప్రాంగణంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ జన్మదిన పురస్కరించుకొని వారు స్థానికంగా ఉన్న డాక్టర్స్ తో జ్యోతి ప్రజ్వలన గావించి శాలువా, పూలమాలలతో సత్కరించడం జరిగింది ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఎందరో వ్యక్తులను ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేవారు వైద్యులని వారిని దైవ సమానులుగా మనము చూస్తున్నామని అన్నారు. సంగారెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బిర్హాన్ చంద్రరాయి జయంతి సందర్భంగా ఈ డాక్టర్స్ డే ని జరుపుకొనుచున్నామని అన్నారు. రోగి మానసిక స్థితిని కనిపెట్టి అతనికి తగిన వైద్యాన్ని అందించేవాడే వైద్యుడు అని ఆయన అన్నారు డాక్టర్ అంకితభావంతో పనిచేసి రోగి ప్రాణాలను కాపాడడంతో అతనిని రోగి దేవుడితో సమానంగా పోల్చుకుంటాడని అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పృథ్వీరాజ్ పండ్లు, బ్రెడ్ పంపిణీచేశారు. కార్యక్రమంలో సదాశీపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ సంతోష్ ,వెంకట్ రామిరెడ్డి, మధులత, ప్రవలిక, వంశీ, నవీన్, అభిజీత్ కుమార్, పూర్వ విద్యార్థుల మిత్రబృందం, లింగాయత్, రైతులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలికి సన్మానం

**కొండపాక, కుకునూరు పల్లి, జూలై,1(జనం సాక్షి):**
లకుడారం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయు రాలు కవిత వేరే పాఠశాలకు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా సోమ వారం పాఠశాల ఆవరణలో వైస్ ఎంపీపీ దేవి రవీందర్ ఉపాధ్యా యురాలు కవితని శాలువాతో సన్మా నించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ



14 సంవత్సరాలు ప్రాథమిక పాఠశాలకు చేసిన సేవలు మర్చిపోలేము అన్నారు. పాఠశాలలో పనిచేసిన రోజులలో విద్యార్థులకు విద్య బుద్ధులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నేర్పించారని ఎక్కడ విధులలో ఉన్న విద్యార్థులకు మరింత విద్యాబుద్ధులు నేర్పించాలని ఆయన కోరారు. ఉపాధ్యాయురాలు కవిత పాఠశాలను విడిచి వెళ్తున్న సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు బోరున విలపించారు. తమను విడిచి వెళ్ళవద్దు ఈ పాఠశాలలోని ఉండాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముక్తేందర్ రెడ్డి, సంతోష్, నర్సింలు, అరవింద్ ,బాల కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు

# నల్లబెల్లం, నాటుసార పట్టివేత

**మునిపల్లి, జూలై 1(జనం సాక్షి):**
మునిపల్లి మండలం కంకోల్ టోల్ గేట్ వద్ద మూడు వేల కిలోల నల్ల బెల్లం, 5 లీటర్ల నాటు సారాను



పట్టుకొన్నట్టు ప్రోహిబిషన్ అండ్ అబ్కారి ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన రమేష్ నాయక్ సోమవారం నాడు కర్ణాటక లోని మన్నెల్లి నుండి టి ఎస్ 24టి 0723 నెంబర్ గల బొలెరో వాహనంలో 5 లీటర్ల నాటు సారా, 3000కేజీల నల్లబెల్లం తరలిస్తుండగా మునిపల్లి మండలం కాంకోల్ టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ తనిఖీలో సిఐ గాంధీనాయక్, ఎస్సై యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ అలీమ్, కానిస్టేబుళ్లు మల్లయ్య, వివేక్, వినయ్, ఉమారాణిలు పాల్గొన్నారు.



# డా. ప్రభాకర్‌కు సన్మానం

**చేర్యాల జూలై 01 (జనంసాక్షి) :**
చేర్యాల ప్రాంతానికి చెందిన డాక్టర్ కర్రోళ్ల ప్రభాకర్ ను జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత కర్రోల్ల నవజీవన్, బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు గ్రహీత కర్రోల్ల అన్నమ్మ చేతుల మీదుగా కేకు కట్ చేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అన్నమ్మ నవజీవన్ మాట్లాడుతూ.. అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారు. వైద్యము అంటే ఒక వృత్తిగా కాకుండా మనుషులని బ్రతికించే ఓ మహా శక్తిగా ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులందరికీ జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి మండల నాయకులు

**దౌల్తాబాద్ జూలై 1(జనం సాక్షి)**
దౌల్తాబాద్ మండల పరిధిలో లింగాయపల్లి తండాలో ఉపసర్పంచ్ తల్లీ మరణించిన విషయం తెలుసుకుని దౌల్తాబాద్ బి.జె.పి మండల సీనియర్ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పోతరాజు కిషన్, లింగాయపల్లి తండా తాజా మాజీ సర్పంచ్ యాదగిరి, బిజెపి సీనియర్ నాయకులు గడ్డమీది స్వామి, రామస్వామి గౌడ్, కోనయిపల్లి మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచులు ముబారస్పూర్ స్వామి, బొల్లం స్వామి, బీజేపీ నాయకులు సుచిత్ గౌడ్, బొట్క లక్ష్మణ్, ,మాచింపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఘణ సన్మానం

**కోహెడ జూలై 01:(జనంసాక్షి ):-**
మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఉద్యోగాలు చేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ పొందిన తోటి ఉద్యోగులు ఆర్. వేణుప్రసాద్(టి.జి.టి), ఎన్. దేవయ్య(లైబ్రరియన్), టి. వెంకట నర్సయ్య (ఎలక్ట్రీషియన్), ఎల్. రాజమల్లయ్య(ఆఫీస్ సభార్డినేట్) లను ప్రిన్సిపాల్ కే.వి.చలపతి, ముఖ్య అతిధిదులుగా విచ్చేసిన అశోక్ బాబులు హాజరయ్యి తోటి ఉద్యోగులను పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల నుండి ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, బంధుమిత్రులు హాజరయ్యారు. వారిని ఘణంగా సన్మానించి భవిష్యత్‌లో శేష జీవితం సుఖ, సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

# సన్నలకే కాదు దొడ్డు ధాన్యానికి బోనాస్ 500 ఇవ్వాలి

**రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కావద్దు**

**అభిప్రాయ సేకరణ మహాసభలో రైతుల స్పష్టికరణ**

ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని, సన్న ధాన్యానికే కాకుండా దొడ్డు వడ్లకు కూడా బోనస్ 500 రూపాయలు చెల్లించాలని మండల పరిషత్ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, సొసైటీ చైర్మన్ చింతల వెంకట్ రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం రైతు భరోసా పథకం అమలు పై క్షేత్రస్థాయిలో రైతు అభిప్రాయ మహాసభ జరిగింది. ఈ సభకు హాజరైన 150 మంది రైతులలో 95 శాతం మంది రైతులు 10 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని వారి అభిప్రాయాన్ని వెల్లడించారు. అదేవిధంగా ఈ రైతు మహాసభకు హాజరైన తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు అక్కమోళ్ల మైసయ్యయాదవ్ 10 ఎకరాల వరకు రైతు భరోసా పథకం ఇవ్వాలని ఆయన వినతి పత్రాన్ని మండల పరిషత్ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణకు, సొసైటీ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డిలకు అందజేశారు. అంతముందుకు జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. మన సొసైటీలో రుణాలు తీసుకున్న 1042 మంది రుణమాఫీ అర్హుల రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం సీలింగ్ లేకుండా రుణమాఫీ చేసిందని ఈ ప్రభుత్వం కూడా రుణమాఫీ ఎటువంటి ఆంక్షలు లేకుండా రేషన్ కార్డు ప్రాతిపదికను పక్కకు పెట్టి, రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతన్నలను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. రైతు భరోసాను కార్పొరేట్ కంపెనీలకు, గుట్టలకు, రోడ్లకు, సినిమా వర్గానికి, పారిశ్రామిక గద్దలకు ఇవ్వకుండా సాధారణ రైతులకు మాత్రమే ఇవ్వాలని వారు సూచించారు. ఈ సమావేశంలో డిసిఏఓ కరుణాకర్, ఏవో



లావణ్య, పిఎసిఎస్ సీఈఓ మధు యాదవ్, బ్యాంక్ అధికారి కృష్ణాకర్, నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీలు, ఇందిరా శ్రీనివాస్, దశరథ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, నాయకులు రవినాయక్, సేవరత్న అవార్డు గ్రహీత బండారి గంగాధర్, నాయకులు నారాయణరావు, బిక్షపతి రావు, యాధాగౌడ్, వీరాస్వామి, పాపయ్య చారి, పెంటా గౌడ్, బిక్షపతి రెడ్డి, బాల్వంత్ రెడ్డి, చెరుకుపల్లి నరసింహారెడ్డి, నర్సింలు సొసైటీ డైరెక్టర్, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పల్లా రాజేశ్వర్ రెడ్డి అరెస్టు అన్యాయం

### చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్

చేర్యాల జూలై 01 (జనంసాక్షి) :

ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అక్రమ అరెస్టు చేస్తే ఊరుకోమని చేర్యాల ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని అక్రమ అరెస్టు నిరసిస్తు చేర్యాల పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీపీ వులంపల్లి కరుణాకర్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల సమస్యల పట్ల ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన మోతిలాల్ నాయక్ ని పరామర్శించడానికి వెల్లిన జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 7 నెలలు గడుస్తున్నా నిరుద్యోగుల పట్ల ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గానీ జాతీయ నాయకులు గాని తెలంగాణ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనంతుల మల్లేశం, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గూడూరు బాలరాజు, సర్పంచ్ ల ఫోరం తాజా మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, నాయకులు సుక్కారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.



## గల్ఫ్ కోర్టు సిబ్బందికి జీతాలు ఇవ్వాలని ఆందోళన

**తూప్రాన్ జులై 1 (జనం సాక్షి):**

మండలంలోని నాగులపల్లి శివారులో గల గల్ఫ్ కోర్టులో పనిచేస్తున్న సిబ్బందికి గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం ఇవ్వకపోవడంతో గేటు వద్ద ఆందోళనకు దిగారు. కలుపుకోటులో సుమారు 200 మంది వరకు పనిచేస్తున్నారని వారికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తమ కుటుంబం గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యజమాని వెంటనే జీతాలు ఇవ్వాలని తమ కోరుతున్నామని తెలిపారు.




## జోగిపేటలో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

**జోగిపేట, జూలై 1(జనం సాక్షి)**

వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఘనంగా జరుపుకున్నారు, పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ సూపరిండెంట్ రమేష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సూపరిండెంట్ రమేష్ తోటి డాక్టర్లను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుక లు జరుపుకున్నారు, అలాగే స్వీట్స్ పంచి పెట్టారు, ఈ కార్యక్రమంలో సీనియర్ డాక్టర్ వీణ డాక్టర్ అనూష, వైద్య సిబ్బంది, నాయకులు నర్రా బీమరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జోగిపేట లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లను వారు ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా డాక్టర్ల సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఆల్లె శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, కోశాధికారి సంతు, సంతోష్ కుమార్ ,రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# 10 ఎకరాలకే రైతుబంధు ఇవ్వాలి

**చెట్లు గుట్టలుగా ఉన్న 100 ఎకరాలకు ఇవ్వొద్దు**

**రైతుబంధు అమలుపై రైతుల అభిప్రాయాల వెల్లడి**

**జోగిపేట, జూలై1(జనంసాక్షి):**

5 నుంచి 10 ఎకరాల లోపే ఉన్న రైతులకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలని,100 ఎకరాలు ఉన్న చెట్లు గుట్టలకు రైతుబంధు ఇవ్వొద్దని అలా రైతుబంధు ఇస్తే సన్న చిన్నకారు రైతు నష్టపోవాల్సి వస్తుందని అందోల్ మండల పరిధిలోని ఆయా గ్రామాల రైతులు వారి అభిప్రాయాలను తెలిపారు. సోమవారం అందోల్ సొసైటీ కార్యాలయంలో డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ ఎస్. జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన రైతుబంధు అమలుపై రైతులకు అవగాహన, రైతుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆయా గ్రామాలకు చెందిన రైతులు హాజరై వారి అభిప్రాయాలను



అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ హాజరయ్యారు. జరిగిన సమావేశంలో రైతులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన రైతులను గుర్తించి 10 ఎకరాల లోపే ఉన్న రైతులకు రైతుబంధు పెట్టుబడి సాయం అందించాలని, కౌలు రైతులకు కూడా రైతుబంధుకు అర్హులుగా ఎంపిక చేయాలని వారు కోరారు. 100 ఎకరాలకు రైతుబంధు ఇస్తే అసలైన సన్న కారు చిన్న కారు రైతు నష్టపోతున్నారని, ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి 10 ఎకరాలలోపే ఉన్న రైతులకు మాత్రమే రైతుబంధు చెల్లించాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశానికి హాజరైన రైతులు చాలా మంది 10 ఎకరాలకు మాత్రమే రైతుబంధు చెల్లించాలని అధికారులకు అభిప్రాయాలు తెలియజేయగా, మరికొందరు రైతులు 5 ఎకరాలకే రైతుబంధు ఇవ్వాలని తెలియజేయగా, రైతులు తెలిపిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, పీఏసీఎస్ సొసైటీ వైస్ చైర్మన్ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్ హరికృష్ణ గౌడ్, వ్యవసాయ శాఖ ఏడి అరుణ, ఏవో విజయరత్న, సొసైటీ సీఈఓ కే. నర్సింలు, సిబ్బంది భరత్ తోపాటు రైతులు పాల్గొన్నారు.



## సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వ మిషన్

**ఝరాసంగం, జులై 1(జనం సాక్షి):**

సికిల్ సెల్ అనీమీయా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని బొజ్జా నాయక్ తండాలో సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కొరకు వీధుల్లో తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు. తదుపరి స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాధి నిర్మూలనకు మిషన్ ఏర్పాటు చేసి 2047 నాటికి సికిల్ సెల్ అనీమియా వ్యాధిని నిర్మూలించడానికి ప్రాతిపాదించడం జరిగింది అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 0 నుంచి 40 సంవత్సరాల వయసు గల వారికి పరీక్షించడం, చికిత్స చేయడం, సంరక్షించడం జరుగుతుందన్నారు. సికిల్ సెల్ అని మియా వ్యాధి అనేది జన్యు కారకమైంది. వ్యాధిపై అవగాహన పెంచుకొని జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు, దీంతో రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి చేసే జన్యువులు లోపబోయిష్టంగా మారుతాయని వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సిహెచ్ఓ సుదర్శన్, ఏఎన్ఎం అనిత, ఉపాధి హామీ ఎపిఓ రాజకుమార్, నాయకులు కిషన్, చంద్ర నాయక్,భోజ నాయక్,మారుతి శంకర్,దమ్మా నాయక్,సుభాష్, గణేష్, ఆశ కార్యకర్తలు,అంగన్వాడి మరియు గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

## వైద్యులకు సన్మానం

**కొండపాక, కుకునూరు పల్లి, జూలై,1(జనం సాక్షి):**

డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం ఉమ్మడి కొండపాక మండలం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కుకునూరుపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సన్మానిం చారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉప్పల రాజు మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమై ంది ప్రాముఖ్యమైందని అన్నారు.వైద్య నారాయణ అంటూ వైద్యులను దేవునితో పోలుస్తారు దేవుడు మనుషులకు జన్మనిస్తే వైద్యులు చికిత్స ద్వారా పునర్జన్మ ఇస్తారనీ పేర్కొన్నారు. వృత్తిలలో పవిత్రమైన వృత్తిగా భావిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్న డాక్టర్ల రుణం ఎప్పటికి తీర్చుకోలేనిదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల వాసవి క్లబ్ సెక్రెటరీ వేముల శివప్రసాద్, కోశాధికారి కాపర్తి రాజకుమార్, ఆరోగ్య కేంద్ర సూపర్వైజర్ సుజాత, వైద్య సిబ్బంది పర్వీన్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



# ఆత్మ కమిటీ చైర్మన్‌గా వై. ప్రభు..!



**కొండాపూర్ జూలై 1 (జనం సాక్షి)**

ఆత్మ కమిటీ చైర్మన్ గా సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని తొగర్ పల్లి గ్రామానికి చెందిన ఎల్లకొండ ప్రభు ను నియమించారు. 24 మంది సభ్యులతో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు తూర్పు జయప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్పోరేషన్ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులు సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఆత్మ కమిటీ లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రైతుల అభివృద్ధి కోసం రైతుల పంట రుణాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చినటువంటి హామీ మేరకు రైతు రుణమాఫీ ఒకే దఫాలో మాఫీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు.రైతు భరోసా కార్యక్రమాలను త్వరలోనే అమలు చేసి రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ ఎల్లకొండ ప్రభు మాట్లాడుతూ తనమీద ఉన్న నమ్మకంతో బాధ్యత ఇచ్చినందుకు టిపిసిసి అధ్యక్షులు జగ్గారెడ్డి కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డిలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలకు కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఎంపిటిసి నరసింహారెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి ,మాణిక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, కాంగ్రెస్ అధ్యక్షుడు గడిల రామ్ రెడ్డి, తోపాజి అనంత కిషన్, రామకృష్ణారెడ్డి, రామారావు దేశ్పాండే, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సునీల్ , జిల్లా సేవా అధ్యక్షులు, ప్రశాంత్ గౌడ్, ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ, మండల నాయకులు, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

**హత్నూర జూలై 01 (జనం సాక్షి)**

మండలంలోని చింతల్ చెరు గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆత్మగౌరవ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర హాజరై ప్రసంగించారు. ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించడంతో పాటు తప్పనిసరిగా గ్రామ కమిటీలను వేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి సుధాకర్, అర్జున్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు వీరయ్య, రాజు, సాయిలు, శ్రీకాంత్, రమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## గ్రీవెన్స్ డే సందర్భంగా ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ

**వనపర్తి బ్యూరో జులై 01 (జనంసాక్షి)**

ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే ప్రజావాణిలో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

## భారత ప్రభుత్వం చట్టాల్లో మార్పులు

### మద్దూర్ ఎస్సై రామ్ లాల్

**మద్దూరు జూలై 1 (జనం సాక్షి)**



భారత ప్రభుత్వం జూన్ 1 నుండి చట్టాల్లో కొన్ని మార్పులు చేసిందని, చట్టాలు మార్పు వల్ల వాటిలో కొన్నింటిని కఠినతరం చేస్తూ ప్రజలకు అనువుగా ఉండేటట్లు మరియు చట్టాలను అతిక్రమించే వారి పట్ల కఠినమైన శిక్షలు పడేటట్లుగా రూపొందించిందిని మద్దూర్ ఎస్సై రామ్ లాల్ తెలిపారు. సోమవారం ఆయన " జనం సాక్షితో మాట్లాడుతూ గతంలో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అదినీయం, చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు.

# రోడ్డు మరమ్మతులు చేయండి

### ఢిల్లీ వరల్డ్ స్కూల్ మేనేజ్ మెంట్‌ను కోరిన 2బీహెచ్ కే వాసులు



**వనపర్తి, జూలై01, (జనంసాక్షి):**

వనపర్తి– ఖిల్లా ఘనపురం రోడ్డుపై గల చైతన్య స్కూల్ నుంచి డబుల్ బెడ్ రూముల మూడవ బ్లాక్ వరకు ఉన్న మట్టి రోడ్డును మరమ్మతు చేయాల్సి ఉన్నందున అవసరమైన మొరం మట్టిని పోయించాలని ఢిల్లీ వరల్డ్ స్కూల్ మేనేజ్ మెంట్ ను కోరుతూ చిట్యాల రోడ్ 2బీహెచ్ కే వాసులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. నిన్న కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలు పడి బురదమయంగా మారిందని. ఢిల్లీ వరల్డ్ స్కూల్ బస్సులు నడవడం వల్లే గుంతలు పడ్డాయని, దీనివల్ల కాలనీవాసులు నడుచుకుంటూ వెళ్లాలన్న, ద్విచక్ర వాహనాలపై వెళ్లాలన్న బురదలో బైకులు స్లిప్పు అవుతున్నాయని పేర్కొన్నారు. ఢిల్లీ వరల్డ్ స్కూల్ మేనేజ్ మెంట్ ను కోరినా ఇప్పటి వరకు స్పందించక పోవడం బాధ్యతారాహిత్యమని, ఇప్పటికైనా మొరం మట్టి వేసి చదును చేయకుంటే ఆ స్కూల్ బస్సులు ఈ రోడ్డుపై తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మునీరొద్దీన్ నిరంజన్, కాలనీ వాసులు మండ్ల రాజు వినోద్ ఖలీల్ అహ్మద్ సాయిలీల, ఖాజా నారాయణ రెడ్డితో పాటు పలువురు ఐద్వా నాయకురాళ్ళు పాల్గొన్నారు.

# వైద్యులు దైవ సమానులు

### డాక్టర్ కుఘనసన్మానం

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**



సమాజంలో ప్రాణాపయాస్థితిలో ఉన్నవారికి మానవతదృపదంతో మెరుగైన వైద్యనందించి పునర్జన్మను ప్రసాధించే బ్రహ్మ స్వరుపులు వైద్యులని ఎస్పి బాలసు బ్రహ్మణ్యం ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ వైద్య దినోత్సవం సందర్బంగా ఎస్పి బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ జనరల్ ఫిజి షియన్ గందె కార్తీక్ కుమార్ ను తన ఆసుపత్రిలో శాలువలతో సత్కరించి మొక్కను బహుకరించారు పేద ప్రజలకు ఏచిన్న ఆపద కలిగిన వెంటనే స్పందించె గొప్ప వైద్యుడు గందె కార్తీక్ అని వైద్యం పట్లనే కాకుండా కళల ను కళాకారులను ప్రోత్సహిస్తూ తనవంతుగా బాలకేంద్రంలో కళాంశాలలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు సహాయ సహకారం అందించిన గొప్ప వైద్యుడని అన్నారు. ఈకార్యక్రమంలో సంగ నర్సింహులు వసంత్ కుమార్ రామకృష్ణ కళ్యాణి ప్రసాద్ రావ్ హరీష్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు

## ఎస్సీ మోర్చా పేట జిల్లా మీడియా సెల్ కన్వీనర్‌గా విజయ్



**నారాయణ పేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

పేట పట్టణంలోని బిజెపి కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఎస్సీ మోర్చ నారాయణపేట జిల్లా మీడియా సెల్ కన్వీనర్‌గా దాసరి విజయ్ ను ఎన్నుకోవడం జరిగిందని ఎస్సి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ అధ్యక్షుడు కృష్ణ సీనియర్ నాయకుడు ఆశప్ప జర్నల్ సెక్ కొండం గోపాల్ టౌన్ ప్రెసిడెంట్ లింగరాజు కౌన్సిలర్ విశాలాక్షి కౌన్సిలర్ రమేష్ ఉషప్ప చక్రి తదితరులు పాల్గొన్నారు.



## పదోన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ

**వనపర్తి బ్యూరో జులై 01 (జనంసాక్షి)**

వనపర్తి జిల్లా లోని వివిధ పోలీస్ స్టేషన్లలో హెడ్ కానిస్టేబుల్‌గా కానిస్టేబుల్ గా భాధ్యతలు నిర్వహిస్తూ ఎఎస్సైగా పదోన్నతి పొందిన శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్స్ గా పదోన్నతి పొందిన పరంధాములు, మహేష్, అవులయ్య లను జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి అభినందించారు. కొత్తగా పదోన్నతి పొందిన అధికారులు తప్పనిసరిగా కుటుంబ విలువలను కాపాడుకోవాలని, ముఖ్యమైన కేసులను ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్‌గా స్వీకరించడానికి వారు ఇప్పుడు అర్హత కలిగి ఉన్నారని తెలుసుకోవాలని, దీని కోసం వారు అంకితభావంతో మరియు చిత్తశుద్ధితో పని చేయాలని ఎస్పీ అన్నారు.



## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

**మల్దకల్ జులై 1(జనంసాక్షి)**

వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుండడంతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిని డాక్టర్ స్వరూప రాణి సూచించారు.సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాసపు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సీజనల్ వ్యాధులపై గ్రామాలలో ఏ ఎన్ ఎం,ఆశా వర్కర్లు, సూపర్ వైజర్లు, అప్రమత్తంగా ఉండి మలేరియా టైఫాయిడ్, డెంగ్యూ,చికెన్ గున్యా పలు వ్యాధులపై ఆమె అవగాహన కల్పించారు. త్రాగునీరు కాచి చల్లార్చి తాగాలి వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆమె అన్నారు. ఆహారపదార్థాలు వేడిగా వున్నప్పుడే భుజించాలని తెలియజేశారు. వారానికొకసారి ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీహెచ్ ఓ వెంకట స్వామి,సూపర్ వైజర్ శ్రీధర్, షేకమ్మ, పిహెచ్ఎన్ రామేశ్వరమ్మ పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**మొదటి పేజీ తరువాయి..**

నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్రాంత పిఈటి బి.గోపాలం ఆధ్వర్యంలో మాగనూరు, కృష్ణ మండలాల బాలురకు మాగనూర్ మండల కేంద్రం నుండి కున్సి గ్రామం వరకు , 5 కిలోమీటర్ల రోడ్ స్పీడ్ సైకిలింగ్ పోటీలను 12 నుండి 15 సంవత్సరాల మధ్య గల బాలురకు నిర్వహించారు. ఈ సైకలింగ్ పోటీలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సైకిల్ తొక్కి ఉత్సాహ పరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైకిల్ తొక్కడం ఆనందంగా ఉందని అన్నారు.సైకిల్ తొక్కడం మంచి వ్యాయామం అన్నారు .దీంతో అందరికి ఆరోగ్యకరం అన్నారు. విశ్రాంత పీఈటి బి.గోపాలాం ఆధ్వర్యంలో క్రీడల్లో రాణించి, జాతీయస్థాయికి ఎదగాలని, క్రీడలకు పూర్తి సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. ఈ సైకిల్ పోటీలలో దర్శన్, ఆకాష్, రాకేష్, అక్బర్, గణేష్ ,సందీప్ గౌడ్ రాష్ట్రస్థాయి సైకిల్ పోటీలకు ఎంపికయ్యారని బి గోపాలం తెలిపారు. వీరు బోనఫైడ్, ఆధార్ కార్డుతో ఈ నెల మూడు, నాలుగు తేదీలలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో గల సైకిలింగ్ అకాడమీలో జరుగు పోటీలలో పాల్గొంటారని ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ మాజీ సర్పంచ్ లు ,అశోక్ గౌడ్, పెద్దింటి రాజు, నాయకులు శివరాం రెడ్డి, వాకిటి శ్రీనివాసులు, వేణుగోపాల్, యువ మోర్చా మండల అధ్యక్షులు దండు ఆనంద్, యువ నాయకుడు గడ్డం నరేష్ , గోవింద్ పిఈటిలు రాకేష్, అమ్రేష్, శ్రీ వాణి, రమేష్ కుమార్, వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వర్క్ షాప్, సదస్సులకు గీతం అధ్యాపకులు

**మొదటి పేజీ తరువాయి..**

'మెనీ లైవ్ అండ్ ఆఫ్టర్లెక్స్' అనే వర్క్షాప్లో ప్రసంగించడానికి డాక్టర్ సయంతన్ సుండల్, డాక్టర్ జోంధాలే రాహుల్ హిరామన్ లు ఆహ్వానం అందుకున్నారు. వారిద్దరూ 2022 నుంచి బంగ్లా, మరాఠీ దళిత పీరియాడికల్స్ కొనసాగిస్తున్న పరిశోధనను యూకే-ఆధారిత పీహెచ్ స్కాలర్లకు పరిచయం చేయడం, పీరియాడియల్ సంస్కృతిపై సరిశోధన కొనసాగించేందుకు శిక్షణ ఇచ్చి, విద్యార్థులకు ఒక పద్ధతిని అలవరచడం ఈ వర్క్ షాప్ లక్ష్యం. ఈ కార్యక్రమం తరువాత, యునైటెడ్ కింగ్డమలోని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్లో జులై 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న గ్లోబల్ బుక్ కలర్స్: మెటీరియలిటీస్, కొలాబరేషన్, యాక్సెస్ అనే పేరుతో సొసైటీ ఫర్ ది హిస్టరీ ఆఫ్ ఆథర్షిప్, రీడింగ్, అండ్ పబ్లిషింగ్ 2024 సదస్సులో డాక్టర్ సయంతన్, డాక్టర్ రాహుల్ ఉపన్యసిస్తున్నారు. వర్తమానంలో, గతంలో విశ్వవ్యాప్తంగా పుస్తకాలు, గ్రంథాలు ఎలా తయారు చేశారు. ఎలా వాటిని పంపిణీ చేశారు, ఔత్సాహికులు వాటిని ఎలా చదివారు అనే దానిపై ఈ సమావేశం దృష్టి సారిస్తోంది. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ స్, హైదరాబాద్ అధ్యాపకులు డాక్టర్ సయంతన్, డాక్టర్ రాహుల్ ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమాలలో ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

# సర్వే నెంబర్ 618లో నివాసముంటున్న ఇళ్లకు రైతుబంధు ఆపాలి



సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్, వంక గోపాల్

**వీపనగండ్ల, జులై 01 (జనం సాక్షి)**

వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం రెవెన్యూ శివారు సర్వే నెంబర్ 618లో 40 ఏళ్లుగా ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న 15 ఎకరాల 10 గుంటల భూమికి రైతుబంధు సాయం ఇంతకుముందు పట్టాదారులకు ఇవ్వడం ఆపాలని సిపిఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. వీపనగండ్ల తహసిల్దార్ వరలక్ష్మి కలిసి రైతుబంధు ఆపాలని కోరారు. ఇంతవరకు చెల్లించిన డబ్బులు పట్టాదారుల నుంచి ప్రభుత్వం రికవరీ చేయాలని కోరారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్, వంక గోపాల్, జె.రమేష్ మాట్లాడుతూ... 618 సర్వే నెంబర్ గల భూములను పట్టాదారులైన భూ యజమానులు 40 ఏళ్ల క్రితం ఇళ్ల స్థలాల కోసం అమ్ముకున్నారు అని కొన్నవారు కూడా 40 ఏళ్ల క్రితం ఇండ్లు నిర్మించుకొని నివాసం నివాసం ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నుండి రైతుబంధు సహాయం ఉండాలంటే వ్యవసాయ భూమి అయి ఉండాలని కానీ ప్రభుత్వ అధికారులకు సర్వే నెంబర్ లో నివాస ఇల్లు నిర్మించుకున్న విషయం అధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇండ్లకు ఇంటి పన్ను, కరెంటు బిల్లు ,నల్ల బిల్లు కూడా చెల్లిస్తున్నారు. అయినప్పటికీ ఆ భూమిపై పట్టేదారులు ఏళ్లుగా రైతుబంధు, బ్యాంకు రుణాలు పొందుతున్నారని విమర్శించారు. రైతుబంధు ఆపాలని జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, తహసిల్దార్ ఏవో కూడా సిపిఐ నాయకులు, నివాసం ఉంటున్న వారు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన రైతుబంధు సాయం ఆపటం లేదని, వెంటనే రైతుబంధు సాయం ఆపాలని డిమాండ్ చేశారు. రైతుబంధు ఆపేందుకు జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు వంక గోపాల్, జె రమేష్ ,సిపిఐ సీనియర్ నాయకులు ఎం.కురుమయ్య, బొల్లారం గ్రామ శాఖ కార్యదర్శి చల్మారెడ్డి, నివాసం ఉంటున్న గృహస్తులు ఎరుకలి గోపి,చాకలి స్వామి,ఎం.వెంకటయ్య, గొల్ల చిన్నస్వామి,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి

**మఖ్తల్ జూలై 01 (జనంసాక్షి)**



విద్యార్థినులు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని షి టీమ్ పోలీసులు తెలిపారు. సోమవారం మక్తల్ మండలంలోని జక్లేర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీ టీం పోలీసులు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం పోలీసులు బాలరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న పలు అంశాల పైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. సామాజిక రుగ్మతులైన అంటరానితనం, బాల్యవివాహాలు తదితర అంశాల పై కూడా అవగాహన కలిగి ఉండాలని వినయంతో కూడిన విద్య ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని ఆదిశగా విద్యార్థులు చదువుపై పట్టు సాధించాలని వారు సూచించారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఎవరైనా వేదింపులకు గురి అయినా, ఈవ్ టీజింగ్ చేసినా, ర్యాగింగ్ చేసిన అత్యవసర సమయంలో షి టీమ్ నెంబర్ 87126 70398 సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు బాలరాజు, సమిన, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ భవనానికి మోక్షం..!

**మొదటి పేజీ తరువాయి..**

పంచాయతీ రాజ్ అధికారుల వైఫల్యం కారణంగానే పంచాయతీ భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొందని స్థానికులు మండి పడుతున్నారు.

## ప్రారంభించనున్న ఎంపీ షెట్కర్

మండలంలోని అత్తునూర్ గ్రామంలో రూ:25 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ఈ నెల 3న స్థానిక జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మమ్మద్ గౌసోద్దీన్, కాంగ్రెస్ నాయకులు మమ్మద్ రఫీయోద్దీన్, తదితరులు ఏర్పాట్లు చేశారు. ఎంపీతో పాటు స్థానిక ఎమ్మెల్యే కే.మాణిక్ రావు, ఉన్నతాధికారులు, పార్టీ శ్రేణులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నారు.



# పెబ్బేర్ ఎంవిఐ కార్యాలయాన్ని రెగ్యులర్‌గా కొనసాగించాలి

**పెబ్బేరు జూలై 1(జనం సాక్షి)**

పెబ్బేరు పట్టణంలో నెలకొల్పిన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని రెగ్యులర్ గా కొనసాగించాలని సోమవారం శ్రీ కనకదుర్గ లారీ ట్రాన్స్పోర్ట్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, వీరబోజ చారి, సుల్తాన్ లు వినతిపత్రాన్ని అందజేశారు. గత 25 సంవత్సరాలుగా పెబ్బేర్ లో ఎంవిఐ కార్యాలయం కొనసాగినప్పటికీ జిల్లాల ఏర్పాటుతో వనపర్తి లో ఆర్టీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా పెబ్బేరు ఎంవిఐ కార్యాలయం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వనపర్తి పై ఆధారపడ్డారు. నాలుగు మండలాలే కావడంతో పెబ్బేర్ లో ఎంవిఐ కార్యాలయం కార్యకలాపాలు పూర్తిగా తగ్గించారు. ప్రస్తుతం పెబ్బేర్ లో సోమవారం గురువారం మాత్రమే ఎంవిఐ హాజరవుతున్నప్పటికీ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహనదారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతాలలో లారీ అసోసియేషన్ పలు వాహనాలు భారీగా ఉండటం వల్ల ఇక్కడే కార్యాలయాన్ని రెగ్యులర్‌గా కొనసాగించాలని వారు ఇన్చార్జ్ ఎంవిఐ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ అంశాలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.



# బాలల హక్కులు బాల కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**మక్తల్ జూలై 01 (జనంసాక్షి)**

మఖ్తల్ మండలంలోని కాత్రేవుపల్లి గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సమావేశంలో భాగంగా చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ బాలరాజు మాట్లాడుతూ బాలల పరిరక్షణ కమిటీ సభ్యుల బాధ్యత వహించాలని అన్నారు. బాలల హక్కులు, బాల్యవివాహ నిషేధ చట్టం, బాల కార్మిక చట్టం, బాలల పై లైంగిక వేధింపులు, అనాధ బాలలు, బడి బయటి పిల్లలు, బాలల యొక్క చట్టాలు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 తదితర వాటిపై గ్రామ బాలల పరిరక్షణ కమిటీకి వివరించారు.

# రైతుల అభిష్టం మేరకే రైతు భరోసా





మానవపాడు మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి పాల్గొని రైతులతో రైతు భరోసా గురించి చర్చించి వారి వివరాలను సేకరించారు.

- జిల్లా సహకార అధికారి ప్రసాద్ రావు
- నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బి ప్రభాకర్ నాయుడు

**మానవపాడు, జూలై1 (జనంసాక్షి)**

జోగులాంబ గద్వాల జిల్లా, మానవపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక మహాజన సభనందు రైతు భరోసా మీద సంఘ సభ్యులు, రైతుల నుండి సలహాలు సూచనలు తీసుకోవడం జరిగినది. ఇట్టి సభకు అధ్యక్షత సింగిల్ విండో అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సహకార అధికారి ఎం ప్రసాద్ రావు, సీనియర్ ఇన్స్పెక్టర్ యశోద, ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ..డైరెక్టర్, రిజిస్టర్ సహకార శాఖ తెలంగాణ రాష్ట్రం వారి ఉత్తర్వులు ప్రకారం.. రైతు భరోసా పథకంపై సలహాలు సూచనలు కోరడం జరుగుతుందని..రైతుల అభిష్టం మేరకే ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. సోమవారం పిఎస్‌సిఎస్ కార్యాలయవరణలో రైతులతో సమావేశం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులతో రైతు భరోసా పై అభిప్రాయాల సంతకాలని సేకరించారు. చాలామంది రైతులు వారి అభిప్రాయం మేరకు రైతులకు ఒక ఎకరం నుండి 10 ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తే బాగుంటుందని తెలిపారు. బీదలకు ప్రభుత్వం న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గతంలో ఉన్న మాదిరి వందల ఎకరాలు ఉన్న వారికి న్యాయం కాదు అని, ఇప్పుడున్న గవర్నమెంట్‌లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీదలకు మంచిగా న్యాయం జరగాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సింగిల్ విండో ఉపాధ్యక్షుడు అయ్యన్న మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన తట్ ఫారం లు తక్కువ ధరలకు సబ్సిడీ ఇవ్వాలని కోరారు. రైతు భరోసా ఇవ్వడం రైతులకు ఇవ్వడం చాలా మంచిగా జరుగుతుందని ఆయన కోరారు. సొసైటీ డైరెక్టర్ కృష్ణ గౌడ్, లింగారెడ్డి లు మాట్లాడుతూ, ఒక ఎకరం నుంచి పది ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలని కోరారు. నూతన కార్యదర్శి అయినా సందర్భంగా మొదటి సారి జిల్లా సహకార అధికారి, అధ్యక్షుడు, సంఘం డైరెక్టర్లు రైతులతో జ్ఞాపకార్థ ఫోటో దిగిన కార్యదర్శి ప్రభాకర్. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అయ్యన్న, కార్యాలయ నూతన కార్యదర్శి ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్లు,రైతులు, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్, మాజీ సీఈఓ మద్దిలేటి, సిబ్బంది సాయి ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పల్లె దవాఖాన వైద్యులకు ఘనంగా సన్మానం

**మక్తల్ జూలై 01 (జనంసాక్షి)**

జాతీయ వైద్య దినోత్సవ సందర్భంగా సోమవారం బిజెపి ఆధ్వర్యంలో మఖ్తల్ లో పల్లె దవాఖానాలో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాచువార్ ఎంపీటీసీ బలరాం రెడ్డి మాట్లాడుతూ మక్తల్ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యులు అందిస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. ప్రతి వైద్యుడు దేవునితో సమానమని అందుకే ప్రతి ఒక్కరూ వైద్యులను గౌరవించి, వారితో మరిన్ని సేవలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విరోజా, మల్లికార్జున్, హబీబ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలకై మంత్రిని కలిసిన జర్నలిస్టులు

**అల్లాదుర్గం జూలై 1 (జనంసాక్షి)**

ఆందోల్ నియోజకవర్గం పరిధిలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర టీయూ డబ్ల్యుజే అధ్యక్షులు విరాహత్ అలీలకు ఆందోల్ ప్రెస్ క్లబ్, ఆధ్వర్యంలో వేరువేరుగా వినతి పత్రాలు సమర్పించారు. గత 30 సంవత్సరాలుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు పొందలేక పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరగా మంత్రి దామోదర్ రాజ నరసింహ ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఆందోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భూమయ్య, యాదగిరి, వెంకటరెడ్డి, ఆనంద్, సత్యం పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన జిల్లా ఎస్పీ

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

గద్వాల జిల్లా కోదండ పూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చెన్నకేశవులు ఇటీవల మృతి చెందారు. మృతునికి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సభ్యత్వం ఉన్నందున సోమవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షులు, మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి మృతుని భార్యకు సొసైటీ ద్వారా 30 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లో సభ్యత్వం కలిగిన పోలీస్ సిబ్బంది ప్రతినెల జీతం నుండి కో-ఆపరేటివ్ ఎంప్లాయ్ బెనిఫిట్ నిమిత్తము 50 రూపాయల చొప్పున రికవరీ చేయబడుతుందన్నారు. సభ్యత్వము కలిగిన పోలీసు సిబ్బంది ఎవరైనా అకస్మాత్తుగా చనిపోతే వారికి సొసైటీ నుండి 30 వేల ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని, అందులో భాగంగానే మృతుడు చెన్నకేశవులు కుటుంబానికి 30 వేల రూపాయలు అందజేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సెక్రటరీ రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాల బస్సులను సీజ్ చేయండి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది

వీపనగండ్ల, జులై 01 (జనం సాక్షి)

విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు 20 రోజులు అయినా రవాణా అధికారులు విద్యార్థుల కోసం ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ప్రైవేట్ పాఠశాల బస్సులు నడిపే డ్రైవర్లకు అనుభవం, ఆరోగ్యంగా ఉండేవారితో పాటు బస్సులకు తప్పనిసరిగా ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్ ,డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ లను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. బస్సులో సీట్ల పరిమితికి కాకుండా విద్యార్థులను తరలిస్తే ప్రైవేటు స్కూల్ బస్సులను నిలిపివేసి అక్కడికక్కడే ఆందోళనలు నిర్వహిస్తాం అని అన్నారు. జిల్లా పరిధిలోని ప్రవేట్ పాఠశాల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు బస్సుల పైన రవాణా శాఖ అధికారులు దృష్టి పెట్టాలని ఆర్టీవో కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారి మానస కు ఎస్ఎఫ్ఐ నేతలు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది, జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి, జిల్లా కమిటీ సభ్యులు భరత్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులలో 18 దరఖాస్తులు

### జిల్లా ఎస్పీ డి. జానకి



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

జిల్లా పోలీసు కార్యలములో సోమవారం ప్రజా పిర్యాదులలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పిర్యాదుదారులు హాజరై సమస్యలను ఎస్పీకి తెలియజేసి అర్జిలను సమర్పించారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యదు దారులకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. మొత్తం 18 దరఖాస్తులు వచ్చాయనీ, సామాన్య ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని వారితో స్నేహబావంగా మేసులు కోవాలని సూచించారు.



## పేదల డాక్టర్‌గా పేరుగాంచిన డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి

### డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ఆస్పత్రి సిబ్బంది

**వనపర్తి బ్యూరో జులై 01 (జనంసాక్షి)**

ప్రజలకు సేవ చేయాలన్న అంకితభావం, చిత్తశుద్ధి ఉంటే..ఎంత పెద్ద సమస్యైనా దానికి అడ్డుకాబోదు అనడానికి ఆయనే ప్రత్యక్ష ఉదాహరణ ఆయనో పేదల డాక్టర్... అంతకుమించి మనసున్న డాక్టర్...ఆయనే డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి. డాక్టర్స్ డే సందర్భంగా తన దగ్గర పనిచేస్తున్న కాంపౌండర్సు, నర్సులు పుష్ప గుచ్చాలు, శాలువాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వనపర్తి పట్టణ ప్రాంతం అయినటువంటి గాంధీచౌక్‌లో ఆసుపత్రి ఏర్పటు చేసి తను ఎంతమంది కంపౌండర్లకు జీవన ఆధారంగా చూపించారు. గ్రామీణ వైద్యశిఖామణి అని భావితరాల వైద్యులకు ఓ నిఘంటువు. ఆయన జీవితం ఓ రోల్ మోడల్. ఎందరెందరో డాక్టర్లకు ఆయన స్ఫూర్తిప్రదాత అని అన్నారు వారు ఆయువు ఆరోగ్యాలతో ఉండి తమ వైద్య సేవలు కొనసాగించాలని దేవుని వేడుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బందితో కొంతమంది పాల్గొన్నారు.